

పార్వేటకు వెళ్తూ కానరాని లోకాలకు..

శ్రీశైలం ఘాట్ రోడ్డులో బొలెరో వాహనం ఎదురుగా వచ్చిన స్కూటీని ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందారు.

- 8లో..



టిప్పర్ ఢీకొని బాలుడు మృతి

రోడ్డు దాటుతున్న ఎనిమిదేళ్ల బాలుడిని టిప్పర్ ఢీకొనడంతో మృతిచెందిన ఘటన కొమరోలు మండలం అల్లినగరంలో జరిగింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం
34 /27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

ఇఫ్తార్ : సా॥ 06:28 ని॥
ఆదివారం
సహర్ : ఉ॥ 04:43 ని॥
సోమవారం

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

145 మంది గ్రేడ్-2 వీఆర్వోలకు సర్వీస్ రెగ్యులర్



ప్రొహిబిషన్ డిక్లరేషన్ అందజేస్తున్న డీఆర్వో శ్రీలత

ఒంగోలు అర్బన్: జిల్లాలో 145 మంది గ్రేడ్-2 వీఆర్వోలకు సర్వీస్ రెగ్యులర్ చేస్తూ ప్రొహిబిషన్ డిక్లరేషన్ ఇస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పీ రాము ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత చేతుల మీదుగా వీఆర్వోలు ప్రొహిబిషన్ డిక్లరేషన్ అందుకున్నారు. 2020లో వీఆర్ఏల నుంచి వీఆర్వోలుగా పదోన్నతి పొందిన 145 మంది గ్రేడ్-2 వీఆర్వోలకు ప్రొహిబిషన్ పీరియడ్ ముగియడంతో వారి సర్వీసును రెగ్యులర్ చేసి పే స్కేల్ మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో వీఆర్వోల సంఘం నాయకులు రంగయ్య, జానయ్య, రెగ్యులర్ అయిన వీఆర్వోలు కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్వోలకు కృతజ్ఞతలు తెలిపారు.

సత్తాచాటిన గుంటూరు జిల్లా ఎడ్లు



బండ లాగుతున్న ఎడ్లు

బేస్తవారిపేట: మండలంలోని పిటికాయగుళ్లలో పట్టాభిరామస్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా శనివారం రాష్ట్ర స్థాయి బండ పందెం నిర్వహించారు. గుంటూరు జిల్లా పత్తిపాడుకు చెందిన పమిడి అంజయ్యచౌదరి ఎడ్లు 2931 అడుగులతో మొదటి, వైఎస్సార్ జిల్లా కలసపాడు మండలం మామిళ్లపల్లెకు చెందిన బట్టపోతుల శంకరయ్య యాదవ్ ఎడ్లు 2610 అడుగులతో ద్వితీయ, దువ్వూరు మండలం పెద్ద జొన్నవరం కాకి యుగంధర్ ఎడ్లు 2416 అడుగులతో తృతీయ, అర్ధవీడు మండలం కాకర్లకు చెందిన రావూరి బాబు ఎడ్లు 2398 అడుగులతో నాల్గొవ, యర్రగొండపాలెం మండలం గోలవీడుకు చెందిన వీ శ్రీనివాసరెడ్డి ఎడ్లు 2389 అడుగులతో ఐదో స్థానం సాధించారు. గెలుపొందిన ఎడ్ల యజమానులకు దాతలు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలను పంపిణీ చేశారు.

సత్తాచాటిన సంతమాగులూరు ఎడ్లు

కంభం: ఉపదేశ రామస్వామి వారి 59వ వార్షిక కళ్యాణమహోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని లింగోజిపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీల్లో బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన వజ్రాల తేజశ్రీరెడ్డి ఎడ్లు 5487.01 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. నంద్యాలకు చెందిన యం.భావనరెడ్డి ఎడ్లు, గిద్దలూరుకు చెందిన శ్రీనివాసరెడ్డి ఎడ్లు 5200 అడుగులు లాగి ద్వితీయ స్థానం, మండలంలోని యర్రబాలేనికి చెందిన వెంకటగిరి హేమలతనాయుడు ఎడ్లు 4934.02 అడుగులు లాగి తృతీయ స్థానం, పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన కె.వెంకట రామాంజనేయులు ఎడ్లు 4908.06 అడుగులు లాగి నాల్గో స్థానం, బేస్తవారిపేట మండల వంగపాడుకు చెందిన కైపా వెంకట రమణారెడ్డి ఎడ్లు 4594.08 అడుగులు లాగి ఐదో స్థానంలో నిలిచాయి. విజేతలకు బహుమతుల కింద రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందజేశారు.

మంచి రోజులు..

వైద్య విద్యకు మంచిరోజులొచ్చాయి. ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఒకే సారి 34 పీజీ సీట్లు పెరిగాయి. మరో 15 సీట్లు పెరిగే అవకాశం ఉంది. ఫలితంగా సూపర్ స్పెషాలిటీ నిపుణులు అందుబాటులోకి రానున్నారు. దీంతో జిల్లా వాసులు క్లిష్టమైన రోగాలకు ఇతర జిల్లాలకు, నగరాలకు, మెట్రో పాలిటన్ సిటీలకు వెళ్లకుండానే స్థానికంగా వైద్య సేవలు పొందే అవకాశం దగ్గర కానుంది.

- మెడికల్ కాలేజీకి మహర్దశ
- కొత్తగా 34 పీజీ సీట్లు మంజూరు
- మరో 10 నుంచి 15 వరకు వచ్చే అవకాశం
- మొత్తం 53 పీజీ సీట్లతో ప్రత్యేక మెరుగైన వైద్యవిద్య
- 120 ఎంబీబీఎస్ సీట్లతో బ్యాచ్ కొనసాగింపు
- అందుబాటులోకి రానున్న మరిన్ని సూపర్ స్పెషాలిటీ సేవలు
- జీజీహెచ్, వైద్య కళాశాలపై ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని ప్రత్యేక శ్రద్ధ



ప్రభుత్వ మెడికల్ కాలేజీ

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లా కేంద్రం ఒంగోలు నగరంలో జీజీహెచ్‌కి అనుసంధానంగా ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలకు మహర్దశ పట్టింది. నూతనంగా ఒకేసారి 34 పోస్ట్ గ్రాడ్యుయేషన్(పీజీ) సీట్లు ఈ కాలేజీకి కేటాయించారు. ఇప్పటికే జిల్లాలోని ప్రజలకు విస్తృతమైన వైద్య సేవలు అందిస్తున్న జీజీహెచ్...ఇక నుంచి అత్యాధునిక వైద్యసేవలు అందించేందుకు సన్నద్ధమవుతోంది. పీజీ సీట్లు పెరిగే కొద్దీ సూపర్‌స్పెషాలిటీ వైద్యం కూడా అందుబాటులోకి రానుంది. ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాస రెడ్డి ప్రత్యేక చొరవతోనే పీజీ సీట్లు పెరిగేందుకు దోహదపడింది. పేదలకు మెరుగైన వైద్యం అందించే దిశగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగులు వేస్తోందనటానికి ఇదొక మచ్చు తునకగా చెప్పుకోవచ్చు.

మహానేత, డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి 2004లో మొదటి సారి ముఖ్యమంత్రి అయిన తరువాత జిల్లాకు రిమ్స్ వైద్యశాలను మంజూరు చేయించారు. అప్పట్లో ఒంగోలు ఎమ్మెల్యేగా ఉన్న బాలినేని శ్రీనివాస రెడ్డి ప్రత్యేక చొరవతో ఒంగోలులో దీనిని ఏర్పాటు చేశారు. ఆ తరువాత రిమ్స్ అనుసంధానంగా వైద్య కళాశాలను కూడా డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రతిపాదనలు కేంద్రానికి పంపి మంజూరు చేసేందుకు కృషి చేశారు. అప్పటి నుంచి ప్రభుత్వ వైద్యశాల, మెడికల్ కళాశాలలు జిల్లా వాసులకు వరంగా మారాయి.

కొత్తగా 34 పీజీ సీట్ల కేటాయింపు:

ఒంగోలు ప్రభుత్వ మెడికల్ కళాశాలకు నూతనంగా 34 పీజీ సీట్లు మంజూరయ్యాయి. గతంలో ఈ కళాశాలను మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం వచ్చి ఇక్కడి మౌలిక వసతులను పరిశీలించింది. దీంతో వైద్య కళాశాలలో పీజీ సీట్లు పెంచటంతో పాటు జీజీహెచ్‌లో మెరుగైన వైద్య సేవలు కూడా అందించేలా ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి ముఖ్యమంత్రి దృష్టికి పీజీ సీట్ల పెంపు విషయాన్ని తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన సీఎం వైఎస్ జగన్ పీజీ సీట్లు పెంచేందుకు కావాల్సిన అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేయటానికి, కొత్తగా నిర్మాణాలు చేపట్టటానికి నిధులు కూడా మంజూరు చేశారు. దీంతో సంతృప్తి వ్యక్తం చేసిన మెడికల్ కౌన్సిల్ పీజీ సీట్లు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.

పీజీ సీట్లు 53కు పెంపు...

నూతనంగా మంజూరు చేసిన పీజీ సీట్లతో పాటు ఇప్పటి వరకు ఉన్న పీజీ సీట్లు మొత్తం 53కు చేరాయి. గతంలో 19 పీజీ సీట్లు ఉండేవి. వాటిలో సైకియాలజీ 4, ఫార్మకాలజీ 4, మైక్రోబయాలజీ 4, బయోకెమిస్ట్రీ 2, సైక్యాట్రి 2, ఫోరెన్సిక్ మెడిసిన్ 2 సీట్లు, టీబీసీడీ 1 ఉండేవి. కొత్తగా మంజూరైన వాటిలో జనరల్ సర్జరీ 11, కమ్యూనిటీ మెడిసిన్ 7, అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ 9, అనస్తీషియా 7 సీట్లు కేటాయించారు. ఇంకా మరికొన్ని విభాగాల్లో మరో 10 నుంచి 15కు పైగా పీజీ సీట్లు మంజూరయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇకపోతే ఎంబీబీఎస్ 120 సీట్లతో బ్యాచ్ కొనసాగుతోంది.

మెరుగైన వైద్య సేవలు అందించటమే లక్ష్యం



ఒంగోలు నగరంతో పాటు జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ముఖ్యమంత్రి సంక్షేమం, అభివృద్ధిలో భాగంగా వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎటువంటి క్లిష్టమైన రోగానికైనా ఒంగోలులోని ప్రభుత్వ వైద్య శాలలోనే వైద్యం అందేలా చర్యలు చేపట్టాం. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఒంగోలులో రిమ్స్ వైద్యశాలను మంజూరు చేశారు. ఆ తరువాత వైద్య కళాశాల కూడా మంజూరైంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క పీజీ సీటును కూడా తీసుకురాలేక పోయారు. అదనంగా 34 పీజీ సీట్లు కేటాయించేలా సీఎం వైఎస్ జగన్ కృషి మరువలేనిది. జీజీహెచ్‌ని ఇంకా అభివృద్ధి చేస్తాం.

– బాలినేని శ్రీనివాస రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే

వైద్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం



వైద్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందిది. పేదలకు వైద్య సేవలు అందించడంతో పాటు వైద్య విద్యను, వైద్య కళాశాలలను ప్రోత్సహించడం శుభపరిణామం. 2011లో ప్రారంభమైన మెడికల్ కాలేజీలో గతంలో పీజీ సీట్లు 19 ఉంటే ఇప్పుడు ప్రభుత్వం తాజాగా 34 సీట్లను కేటాయించింది. దీంతో మొత్తం 53 పీజీ సీట్లకు చేరింది. ప్రభుత్వ మెడికల్ కాలేజీకి పీజీ సీట్లు కేటాయించడం పట్ల ప్రిన్సిపాల్, జీజీహెచ్ సూపరింటెండెంట్, అన్నీ విభాగాల హెచ్‌ఓడీలతో కలిపి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నా. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో వైద్య విద్యను మరింత బలోపేతం చేస్తాం.

– డాక్టర్ సీహెచ్ సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్

రూ.2,884.50 కోట్ల వ్యాపారం చేసిన పీడీసీసీబీ

- పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి



విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ వెంకయ్య

ఒంగోలు సబర్బన్: పీడీసీసీ బ్యాంకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.2,884.50 కోట్ల మేర వ్యాపారం చేసిందని ఆ బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి బ్యాంకు అభివృద్ధికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి పీడీసీసీ బ్యాంకు దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. సహకార రంగాన్ని సీఎం వైఎస్ జగన్ బలోపేతం చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రధానంగా రైతులకు చేయూతనందిస్తూనే డ్వాక్రా మహిళలకు కూడా చేదోడుగా ఉన్నామన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో డిపాజిట్ల కింద రూ.856.50 కోట్లు సేకరించామని పేర్కొన్నారు. అదేవిధంగా రుణాలు, అడ్వాన్స్‌ల కింద రూ.2028 కోట్లు అందించామని చెప్పారు. దీంతో మొత్తం ఆర్థిక సంవత్సరంలో రూ.2,884.50 కోట్ల మేర వ్యాపారం చేసినట్లైందన్నారు. 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి వ్యాపారాన్ని పెంచుకుంటూ పోతున్నామని వెల్లడించారు. నాబార్డు, ఆప్కాబ్ సహకారంతో రుణాలు విరివిగా ఇస్తూ, రికవరీ శాతాన్ని కూడా పెంచుకుంటున్నామని చెప్పారు. దాదాపు 2 లక్షల మంది రైతులకు రుణాలు ఇస్తూ ప్రోత్సహిస్తున్నామన్నారు. కొన్ని పత్రికలు, చానళ్లు అవాస్తవాలను చూపిస్తున్నాయన్నారు. బ్యాంకు సిబ్బంది, అధికారుల పదోన్నతుల్లో ఏదో అక్రమాలు జరిగినట్లు అసత్య ప్రచారం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పదోన్నతుల విషయంలో అంతా పారదర్శకంగా సాగిందన్నారు. సీఎం వైఎస్ జగన్ ఆశయాలకు అనుగుణంగా బ్యాంకును అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించుకుందాం

- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

పెద్దారవీడు: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతున్న సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుందామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పిలుపునిచ్చారు. మండలంలోని దేవరాజుగట్టు గ్రామం పోలీసుస్టేషన్ ఎదురుగా గ్రామ సచివాలయ, గృహ సారథులకు 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమంపై సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ పథకాల ప్రచార సాధన కిట్లను పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ మ్యానిఫెస్టోని పవిత్ర గ్రంథంగా భావించి సంక్షేమ క్యాలెండర్ ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు ప్రభుత్వం



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

పెద్దపీట వేస్తోందన్నారు. ప్రతి కుటుంబం ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొందుతూ ఆర్థికంగా బలపడుతున్నారని, పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా పరిపాలన చేస్తోందన్నారు. రాష్ట్రాభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తున్న ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా కుట్రలు, టీడీపీ పాలనలోని వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్న గెలుపే లక్ష్యంగా గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పని చేయాలని, పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తకు మంచి గుర్తింపు ఉంటుందన్నారు. గ్రామాల్లో ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు వివరిస్తూ ప్రజల అభీష్టం మేరకు వారి ఇళ్లకు మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను అతికించాలని సూచించారు. కార్యక్రమంలో జార్జి ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ఆదిమూలపు విశాల్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, మండల సచివాలయ కన్వీనర్ ఏర్వ వెంకటేశ్వరరెడ్డి, తిరుమలనాథస్వామి ఆలయ చైర్మన్ దుద్దెల వెంకటరెడ్డి, నియోజకవర్గ, మండల సోషల్ మీడియా కన్వీనర్లు ఒద్దుల లక్ష్మీరెడ్డి, సొంటి నాగార్జునరెడ్డి, నాయకులు రాచగొర్ల పిచ్చయ్య, గుండారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ విభాగాల మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పది మంది తహశీల్దార్లు బదిలీ

ఒంగోలు అర్బన్: జిల్లాలో పది మంది తహశీల్దార్లను బదిలీ చేస్తూ శనివారం కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో కలెక్టరేట్ ల్యాండ్-1 విభాగం సూపరింటెండెంట్‌గా ఉన్న కే సంజీవరావును టంగుటూరు తహశీల్దారుగా, ల్యాండ్-2 విభాగం సూపరింటెండెంట్‌గా ఉన్న కేవీ ప్రసాద్‌ను తాళ్లూరు తహశీల్దారుగా, టంగుటూరు తహశీల్దారుగా ఉన్న కే చిరంజీవిని ల్యాండ్-1 సూపరింటెండెంట్‌గా, తాళ్లూరు తహశీల్దారును గిద్దలూరు, ల్యాండ్ రీఫార్మ్స్ స్పెషల్ తహశీల్దారుగా ఉన్న ఎం జ్వాలానరసింహంను పామూరు తహశీల్దారుగా, పామూరు తహశీల్దారు బీఆర్‌ఎల్‌వీ ప్రసాదరావును పీసీపల్లి, పీసీపల్లి తహశీల్దారుగా ఉన్న ఎస్ వెంకటేశ్వర్లును మార్కాపురం, మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఉన్న ఏఓ పీ ఉమారాణిని ఒంగోలు ల్యాండ్ రీఫార్మ్స్ స్పెషల్ తహశీల్దారుగా, జరుగుమల్లి తహశీల్దారుగా ఉన్న ఎండీ నయీమ్ అహ్మద్‌ను ముండ్లమూరు, ముండ్లమూరు తహశీల్దారుగా ఉన్న ఎస్ ఉషారాణిని జరుగుమల్లి మండల తహశీల్దార్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అడహక్ ప్రమోషన్‌లు:

అడహక్ ప్రమోషన్‌ల కింద ఐదుగురు డిప్యూటీ తహశీల్దార్‌లుగా పదోన్నతిపై పోస్టింగ్‌లు ఇస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన వారిలో వెలిగొండ డిప్యూటీ తహశీల్దారుగా ఉన్న కే ప్రవీణ్ కుమార్‌ను కొనకనమిట్ల తహశీల్దారుగా, మద్రిపూడి డిప్యూటీ తహశీల్దార్ జి జగదీశ్వరరావును అదే మండలం తహశీల్దారుగా, మార్కాపురం ఆర్‌అండ్‌ఆర్ డిప్యూటీ తహశీల్దారు ఎం హరిబాబును మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం ఏఓగా, మార్కాపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీగా ఉన్న జీ రజనీకుమారిని మద్దిపాడు తహశీల్దారుగా, వెలిగొండ ప్రాజెక్టు ల్యాండ్ ఎక్విజేషన్ డీటీగా ఉన్న సీహెచ్ కృష్ణారావును కలెక్టరేట్ ల్యాండ్-2 సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

8 మంది డిప్యూటీ తహశీల్దార్లకు డిప్యుటేషన్:

జిల్లాలో 8 మంది డిప్యూటీ తహశీల్దార్లకు డిప్యూటేషన్ ఇస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో చీమకుర్తి రీ సర్వే డీటీ ఎస్ మాబు సుభానిని ఒంగోలు ఆర్డీవో కార్యాలయంలో డీటీగా, కొత్తపట్నం మండలంలో రీ సర్వే డీటీగా డిప్యూటేషన్‌పై ఉన్న కే శివరామకృష్ణను అదే స్థానంలో, నాగులుప్పలపాడు రీ సర్వే డీటీ ఎస్ ఉదేష్నను వెలిగొండ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ వద్ద డీటీగా, తాళ్లూరు రీ సర్వే డీటీగా డిప్యూటేషన్‌పై ఉన్న కే ఝన్సీలక్ష్మీభాయ్‌ని అదే స్థానంలో, కొనకనమిట్ల రీ సర్వే డీటీగా డిప్యుటేషన్‌పై ఉన్న డీ ప్రకాష్‌ను అదే స్థానంలో, గిద్దలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఎస్ అనిల్‌కుమార్‌ను తర్లుపాడు డీటీగా, తర్లుపాడు డీటీగా ఉన్న బీ శ్రీనివాస్‌ను గిద్దలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీగా, కొనకనమిట్ల డీటీగా ఉన్న కేఆర్ భూపతిని సంతనూతలపాడు డిప్యూటీ తహశీల్దారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీసీపీడీసీఎల్‌లో డిప్యూటీ తహశీల్దారుగా ఉన్న ఏవీ శ్రీనివాసరావును స్పెషల్ డిప్యూటీ తహశీల్దారుగా ఆర్ అండ్ ఆర్ మార్కాపురం యూనిట్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

'ఆసరా'తో మహిళల ఆనందం



గద్దలగుంటలో లబ్ధిదారులకు కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి

- 32వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ ఆసరా సంబరాలు ఎంతో ఆనందంగా డ్వాక్రా గ్రూపు మహిళలు జరుపుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఒంగోలు నగరంలోని 32వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బాలినేని ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. గద్దలగుంటలోని నెహ్రూ బొమ్మ వద్ద నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానికులు బాలినేనికి పూలతో, హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ 2019 ఎన్నికలకు ముందు డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలు మాఫీ చేసుకుంటూ సీఎం వైఎస్ జగన్ మహిళల్లో ఆనందాన్ని నింపుతున్నారన్నారు. చంద్రబాబు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని నమ్మబలికి ఏ విధంగా మోసం చేసిందీ అందరికీ తెలుసునని చెప్పారు. నాలుగు విడతల్లో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మూడో విడత మాఫీ చేయటంతో జిల్లా వ్యాప్తంగా మహిళలు సంబరాలు చేసుకుంటున్నట్లు గుర్తు చేశారు. గద్దలగుంటలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందుతున్న తీరును స్వయంగా బాలినేని అడిగి తెలుసుకున్నారు. గద్దలగుంటతో తమ కుటుంబానికి మంచి అనుబంధం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, 32వ డివిజన్ కార్పొరేటర్ తాడి కృష్ణలత, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కఠారి శంకర్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంటా రామానాయుడు, దామరాజు క్రాంతి కుమార్, పురిణి ప్రభావతి, కార్పొరేటర్లు గోలి లక్ష్మీ కోటేశ్వరమ్మ, ఈదర సురేష్ బాబు, చల్లా తిరుమల రావు, చింతపల్లి గోపీ చంద్, శ్రీరాం నాగభూషణం, నాగం వెంకట శేషయ్య, పసుపులేటి శ్రీనివాసరావు, బేతంశెట్టి శైలజ, గిరిజ శంకర శాండిల్య, ట్రేడ్ యూనియన్ నాయకుడు పి.గోవర్ధన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్రెపాటి శ్రీనివాస రావు, చింతగుంట్ల సువర్ణ, పోతంశెట్టి వెంకటరత్నం, బొమ్మినేని మురళి, తూము పద్మ, అమ్మిశెట్టి ఆంజనేయులు, ఊసా మధుబాబు, బైరెడ్డి అరుణ, రావులపల్లి నాగేశ్వరరావు, నక్కల లీలా కుమారి, మీరావలి, 32వ డివిజన్ నాయకులు డివిజన్ అధ్యక్షుడు కోసూరి శేఖర్, తోటపల్లి సోమశేఖర్, చిట్టెం సురేష్, మన్నే పల్లి అంకబాబు, జువ్విశెట్టి వెంకట్రావు, నత్తల బీమేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నలుగురు ఏఎస్సైలకు పదోన్నతులు

ఒంగోలు టౌన్: ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతులు కల్పిస్తూ ఎస్పీ మలికాగర్గ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలు వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఏఎస్సైగా పనిచేస్తున్న కె.వి.నరసరాజును బాపట్ల జిల్లాకు, టి.ఫిలిప్‌కుమార్‌ను పల్నాడు జిల్లాకు కేటాయించారు. ఒంగోలు టూటౌన్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఐ.శ్రీనివాసరావును బాపట్ల జిల్లా, తాలూకా పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న వి.డేవిడ్‌ను గుంటూరు జిల్లాకు కేటాయించారు. వెంటనే సంబంధిత జిల్లాల్లో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

ఎస్పీని కలిసిన సీఐ...

ఒంగోలు కంట్రోల్ రూం సీఐగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో పొదిలి సర్కిల్‌కు వెళ్లిన కె.వి.రాఘవేంద్రరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మలికాగర్గ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు.

వర్షానికి కూలిన గుడిసె



గాలికి కుప్ప కూలిన పాక

ముండ్లమూరు: మండల కేంద్రం ముండ్లమూరులో శనివారం సాయంత్రం అకాల వర్షానికి గుడిసె కూలింది. అదే సమయంలో ఆ గుడిసెలో ఉన్న ఆరుగురు పరుగులు తీయడంతో తృటిలో ప్రమాదం నుంచి బయట పడ్డారు. బస్టాండ్ సెంటర్‌లో పోలేరమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పాకలో సాయంత్రం సమయంలో వర్షం పడుతుండటంతో స్థానికులు అందులోకి చేరారు. ఈదురు గాలి ఎక్కువ కావడంతో పాక ఒక్కసారిగా కూలింది. అది గమనించిన వారు అక్కడి నుంచి బయటకు పరుగుతీశారు.

హైవేపై ప్రమాదం, ఒకరు మృతి



చంద్రమౌళిని 108లో తరలిస్తున్న దృశ్యం

త్రిపురాంతకం: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. త్రిపురాంతకం మండలం మేడపి హైవే దాటేందుకు బైకుపై ఉన్న వ్యక్తిని బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వినుకొండ వైద్యశాలకు తరలించగా అక్కడ మృతి చెందాడు. మృతుడు కృష్ణా జిల్లా కూచిపూడికి చెందిన వి.చంద్రమౌళి (60) కాగా, స్థానికంగా ఒక బేకరీలో నెల రోజుల నుంచి పనిచేస్తున్నాడు. రోడ్డు దాటే సమయంలో లారీ వెనుక ఉన్న బస్సును గమనించక లారీ వెళ్లిన వెంటనే బైక్‌తో రోడ్డు దాటే ప్రయత్నం చేశాడు. బస్సు కింద పడిపోయి తీవ్రంగా గాయపడిన చంద్రమౌళిని 108 వాహనంలో చికిత్స చేసి పల్నాడు జిల్లా వినుకొండ తరలించగా మృతిచెందాడు. ఆ మేరకు త్రిపురాంతకం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సభ్యులు కృష్ణా జిల్లాలో ఉన్నట్లు సమాచారం.

మార్కాపురంలో భారీ చోరీ

మార్కాపురం: స్థానిక కంభం రోడ్డులోని శివాజీ నగర్ మూడో లైన్లో నివాసం ఉండే బొమ్మలాపురం రమణ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి సుమారు 27 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు శనివారం రాత్రి పట్టణ పోలీస్ స్టేషన్లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. వివరాలు.. దొనకొండకు చెందిన రమణ నాలుగు నెలల క్రితం మార్కాపురం పట్టణానికి వచ్చి శివాజీ నగర్ మూడో లైన్లో నివాసం ఉంటున్నాడు. కాగా తన కూతురు అనారోగ్యానికి గురి కావడంతో బుధవారం రాత్రి గుంటూరు జిల్లా ఫిరంగిపురం వెళ్ళాడు. చికిత్స అనంతరం శనివారం రాత్రి ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గుర్తించాడు. లోపలికి వెళ్లి చూడడంతో బీరువాలో ఉన్న సుమారు 27 తులాల బంగారు ఆభరణాలు, రూ. 2 వేలు కనిపించక పోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించాడు. 2 టౌన్ ఎస్ఐ సువర్ణ దొంగతనం జరిగిన గృహాన్ని పరిశీలించారు. దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వలంటీర్ మృతి

అద్దంకి: రోడ్డు ప్రమాదంలో ఓ వలంటీర్ మృతి చెందాడు. ఈ ఘటన సంతమాగులూరు మండలంలోని అద్దంకి–నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలోని ఏల్చూరు గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి జరుగగా శనివారం వెలుగు చూసింది. కొమ్మాలపాడు గ్రామానికి చెందిన వైకంటి మస్తాన్ బాషా (23) వలంటీర్‌గా పని చేస్తున్నాడు. రాత్రి సమయంలో వర్షం వచ్చే సూచనలు కనిపించడంతో తన కళ్లంలో ఆరబెట్టిన మిరపపై పట్టాలు కప్పేందుకు బైక్‌పై వెళ్లాడు. పట్టాలు కప్పి తిరిగి ఇంటికి వచ్చే సమయంలో బైక్ అదుపుతప్పి సైడులోకి దూసుకెళ్లింది. తీవ్రగాయాలపాలై అక్కడిక్కడే మృతి చెందాడు.

పార్టీ శ్రేణులు
సైనికుల్లా పనిచేయాలి



ఆసరా చెక్కులు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి

- వలంటీర్లను కలుపుకుని చిత్తశుద్ధితో ముందుకు సాగాలి
- జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలను పండుగ వాతావరణంలో నిర్వహించాలి
- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి పిలుపు
- ఆసరా పథకం చెక్కులు అందజేత
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ శ్రేణులు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులంతా వలంటీర్లను కలుపుకుని సైనికుల్లా చిత్తశుద్ధితో పనిచేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పిలుపునిచ్చారు. చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపంలో శనివారం వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంతో పాటు సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు, బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి గ్రామస్థాయిలోని వలంటీర్లతో కలిసి సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు ప్రాణాలు పెట్టి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. అలా పనిచేయడానికి ఆసక్తి లేని వారు గ్రామంలో మిగిలిన వారికి అవకాశం కల్పించాలన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులతో కలిసి ఈ నెల 7న పండుగ వాతావరణంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత కార్యక్రమాలను కూడా ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాలలో లబ్ధిదారులంతా పాల్గొనేలా చూడాలని స్వయం సహాయక గ్రూపులకు సూచించారు.

1,300 గ్రూపులకు రూ.32.6 కోట్ల వైఎస్సార్ ఆసరా...

వైఎస్సార్ ఆసరా మూడో విడత ద్వారా చీమకుర్తి మండలంలోని రూరల్, అర్బన్‌లో 1,300 గ్రూపులకు కలిపి రూ.10.9 కోట్ల నిధులను లబ్ధిదారుల వ్యక్తిగత ఖాతాలలో జమచేసినట్లు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి తెలిపారు. వరుసగా మూడు విడతలలో కలిపి 1,300 గ్రూపుల సభ్యులకు రూ.32.6 కోట్ల నిధులను ఇప్పటి వరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారని వివరించారు. అనంతరం వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కులు పంపిణీ చేశారు. తొలుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కేకు కట్ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ బీ బాబూరావు, మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రూరల్ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ పీ మధుసూదన్‌రావు, కమిషనర్ ఎస్‌కే ఫజులుల్లా, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎస్పీ మలికాగర్గ్



చెక్కు అందజేస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ మరణించిన పోలీసు కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో గతేడాది సెప్టెంబర్ 14న మరణించిన కె.నాగేశ్వరరావు భార్య కె.అచ్చమ్మకు అడిషనల్ కార్పస్ ఫండ్ కింద శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో లక్ష రూపాయల చెక్కును అందజేశారు. నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో మాట్లాడి యోగక్షేమాలడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనను కలవవచ్చని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన ఇతర ప్రయోజనాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. మృతిచెందిన పోలీసు కుటుంబాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీపీవో భద్రతా క్లర్క్ వి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

బొలెరో వాహనం ఢీ.. మహిళ మృతి



సంఘటనా స్థలంలో ఎస్సై మల్లికార్జున

పొదిలి: బొలేరో వాహనం ఢీకొని మహిళ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కర్నూలు రహదారిలో కంభాలపాడు వద్ద శనివారం జరిగింది. శివరాజ్‌నగర్‌కు చెందిన దారా నరసమ్మ(60) మరో ముగ్గురితో కలిసి రెండు ద్విచక్రవాహనాలపై వ్యక్తిగత పని కోసం కనిగిరి వెళుతున్నారు. వర్షం రావటంతో వాహనాలను రోడ్డు పక్కనే చెట్టు కింద ఆపారు. అదే సమయంలో పొదిలి నుంచి జంక్షన్ వైపు వెళుతున్న బొలెరో వాహనం అదుపు తప్పి, వాహనం పక్కనే నిలబడి ఉన్న నరసమ్మను ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిన ముగ్గురు బొలెరో మీదకు వస్తుండటాన్ని గమనించి పక్కకు పరుగు తీశారు. దీంతో వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. సంఘటనా స్థలాన్ని ఎస్సై మల్లికార్జున సందర్శించారు. దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పార్వేటకు వెళ్తూ కానరాని లోకాలకు..



బొలేరో వాహనం నుంచి బయటకు దూసుకొచ్చి రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న క్రాస్ బారియర్



శివనాగప్రసాద్ మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య

పెద్దదోర్నాల: నంద్యాల జిల్లా ఆత్మకూరు సమీపంలోని ముష్టిపల్లిలో జరుగుతున్న పార్వేట ఉత్సవాల్లో పాల్గొనేందుకు వెళ్తూ ఇద్దరు మృతి చెందిన సంఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. శనివారం శ్రీశైలం ఘాట్‌రోడ్డులో ఇష్టకామేశ్వరి ఆలయ ముఖద్వారం వద్ద బొలేరో వాహనం ఎదురుగా వచ్చిన స్కూటీని ఢీకొనడంతో పాటు లోయకు రక్షణగా వేసిన ఇనుప క్రాస్ వారియర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఈ సంఘటనలో బొలేరో వాహనంలో ప్రయాణిస్తున్న నంద్యాల జిల్లా శ్రీశైల పుణ్యక్షేత్రానికి చెందిన ఆలయ అర్చకుడు చిలిమికోటి శివనాగప్రసాద్ (40)తో పాటు పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన వార్డు వలంటీర్ కొరటా వెంకటేష్ (36) దుర్మరణం పాలయ్యారు. మరో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. కొద్ది నిముషాలకు ముందే తనతో పాటు పిల్లలతో మాట్లాడి బయలుదేరిన భర్త నట్టడవిలో విగత జీవుడిగా పడి ఉండటాన్ని జీర్ణించుకోలేక శివనాగప్రసాద్ భార్య బోరున విలపించింది. భర్త మృతదేహంపై పడి కన్నీరుమున్నీరవడం అందరినీ కలచివేసింది. పార్వేట ఉత్సవాల్లో పాల్గొనేందుకు అవసరమైన పూజాద్రవ్యాలను తీసుకుని శివనాగప్రసాద్ ఆత్మకూరు బయలుదేరాడు. కొద్దిసేపటికే రోడ్డు ప్రమాదం జరిగిందన్న సమాచారంతో సంఘటన స్థలికి చేరుకున్న అతని భార్య.. నల్లమల అటవీప్రాంతంలో పడి ఉన్న భర్త మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమైంది. శివనాగప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

వెంకటేష్ మృతితో కన్నీటిపర్యంతమైన స్నేహితులు...

ఘోర రోడ్డు ప్రమాదంతో అనుకోని రీతిలో దుర్మరణం పాలైన తమ స్నేహితుడిని చూసిన వెంకటేష్ సహచరులు కన్నీటి పర్యంతమయ్యారు. ఆడుతూపాడుతూ మాచర్ల నుంచి శ్రీశైల పుణ్యక్షేత్రానికి బయలుదేరిన తమకు జరిగిన ప్రమాదంతో తమ సహచరుడు కన్నుమూయడాన్ని జీర్ణించుకోలేకపోయారు. ఎక్కడో కారు వెనుక సీటులో కూర్చున్న వెంకటేష్ చనిపోవడం దారుణమని వారు విలపించారు. వెంకటేష్‌కు భార్య, కుమార్తెకు తామేమి సమాధానం చెప్పాలంటూ కాలనీకి చెందిన సాంబశివరావు వాపోయాడు.

ఊళ్లపాలెం తీరంలో సోనా బోట్లు



ఊళ్లపాలెం తీరం సమీపంలోకి వచ్చిన కడలూరుకు చెందిన సోనా బోట్లు

సింగరాయకొండ: ఊళ్లపాలెం సముద్రతీరానికి సమీపంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన కడలూరు బోట్లు శనివారం చేపల వేట సాగిస్తూ హల్‌చల్ చేశాయి. ఈ సంవత్సరం జనవరిలో కొత్తపట్నం, పాకల తీరానికి సముద్రతీర ప్రాంత నిబంధనలను అతిక్రమించి వచ్చిన కడలూరు బోట్లను మత్స్యశాఖ, మెరైన్ శాఖలు సంయుక్తంగా మత్స్యకారుల సహకారంతో తరిమి కొట్టారు. ఇక కడలూరు బోట్లు తీరానికి రావటానికి సాహసం చేయవని ఆశించిన కొద్ది రోజులకే పరిస్థితి తారుమారయింది. రెండు మూడు రోజులకు ఒకసారి సోనా బోట్లు యథేచ్ఛగా తీరానికి వస్తూనే ఉన్నాయి. ఒక్కోసారి నాలుగు బోట్లు వస్తుండగా మరోసారి 8 బోట్లు చొప్పున వస్తున్నాయి. బోట్లు తీరానికి వచ్చినప్పుడల్లా రామాయపట్నం మెరైన్ సీఐ ఆర్ఎస్ కిషోర్‌కుమార్, మత్స్యశాఖ జె.డి చంద్రశేఖరరెడ్డి దృష్టికి తీసుకుని వెళుతున్నామని మత్స్యకారులు తెలిపారు. కానీ వారు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని వాపోయారు. శనివారం ఊళ్లపాలెం తీరానికి అతి దగ్గరగా సోనాబోట్లు చేపల వేట సాగించారని దీంతో తమకు చెందిన లక్షలాది రూపాయల విలువగల వలలు తెగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

టిప్పర్ ఢీకొని బాలుడు మృతి



మృతిచెందిన వెంకటమనీస్

కొమరోలు: తినుబండారాలు కొని రోడ్డు దాటుతున్న బాలుడిని టిప్పర్ ఢీకొనడంతో మృతి చెందాడు. ఈ దుర్ఘటన మండలంలోని అల్లినగరం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సాని హరిక్రిష్ణ, రాజేశ్వరి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు సాను వెంకటమనీస్ (8) సాయంత్రం పాఠశాల వదిలిన తర్వాత ఇంటికి చేరుకుని తినుబండారాలు కొనేందుకు తల్లి వద్ద నుంచి డబ్బు తీసుకుని రోడ్డు దాటాడు. తినుబండారాలు కొనుగోలు చేసి తిరిగి వస్తున్న క్రమంలో కొమరోలు నుంచి బద్వేలు వెళ్తున్న టిప్పర్ ఢీకొట్టింది. దీంతో మనీస్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న గిద్దలూరు సీఐ ఎం.డి. ఫిరోజ్, కొమరోలు ఏఎస్సై గోపాలక్రిష్ణ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అప్పటివరకు తమ కళ్లముందే అల్లారుముద్దుగా ఆడుకున్న కుమారుడు విగతజీవిగా రహదారిపై పడి ఉండటంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామంలో విషాదం అలముకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు వైద్యశాలకు తరలించారు.

బాలుడి బంధువుల ఆందోళన

మండలంలోని అల్లీనగరం గ్రామంలో అమరావతి– కడప రాష్ట్రీయ పరిధిలో ధర్నాకు దిగారు. రోడ్డుపై మృతదేహాన్ని ఉంచి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. రోడ్డుకు ఇరువైపులా దాదాపు 3 గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న గిద్దలూరు సీఐ షేక్ ఫిరోజ్, రాచర్ల ఎస్ఐ మహేష్‌బాబులు తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మృతుడి బంధువులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. గ్రామ పెద్దలు కలగజేసుకుని బాలుడి బంధువులకు నచ్చజెప్పి ఆందోళన విరమించేలా చర్యలు తీసుకున్నారు.

మద్దిపాడు పీహెచ్‌సీకి ఎన్‌క్వాస్ సర్టిఫికెట్



మద్దిపాడు పీహెచ్‌సీకి నేషనల్ టీమ్ పంపిన ఎన్‌క్వాస్ సర్టిఫికెట్

మద్దిపాడు: మద్దిపాడు పీహెచ్‌సీ మరో మారు నేషనల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్వాస్) సర్టిఫికెట్‌ కైవసం చేసుకుంది. గత ఫిబ్రవరి 17, 18 తేదీల్లో నేషనల్ టీమ్ సభ్యులు మద్దిపాడు పీహెచ్‌సీని సందర్శించారు. పీహెచ్‌సీలోని ఆరు డిపార్ట్‌మెంట్ల పనితీరును అంశాల వారీగా పరిశీలించారు. ఆస్పత్రిలో ఉన్న వసతులు, ఉద్యోగుల పని తీరు, పేషంట్లకు అందించే వైద్యం, మొదలైన అంశాల గురించి పీహెచ్‌సీకి వచ్చే రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో శనివారం ఎన్‌క్వాస్ సర్టిఫి కెట్‌ను నేషనల్ టీమ్ వారు పంపగా, దానిని జిల్లా టీమ్ సభ్యులు పీహెచ్‌సీ మెయిల్‌కు పంపారు. 2019లో ఏడాది కాలపరిమితికి మొదటి ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ రాగా, మళ్లీ 2023లో ప్రస్తుతం మూడు సంవత్సరాల కాల పరిమితికి సర్టిఫికెట్ ఇవ్వడంతో జాతీయ స్థాయిలో మద్దిపాడు పీహెచ్‌సీ నమోదైంది. ఇకపై సర్టిఫైడ్ ఆస్పత్రులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొదటి ప్రాధాన్యత క్రమంలో మెటీరియల్ అందిస్తాయని ఆస్పత్రి డాక్టర్ మానస తెలిపారు. ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ సాధించడానికి కారణమైన ఆస్పత్రి సిబ్బంది, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ల సీహెచ్‌వోలు, క్షేత్రస్థాయి సిబ్బందికి డాక్టర్లు అభినందనలు తెలిపారు.